కె.బి.యస్. కుమార్



# దీర్ఘ సుమంగళీభవ

ఇది మన దేశం.

భారత దేశం.

ఇందులో జనాభాయే కాదు. సమస్యలూ ఎక్కువే. కష్టాలూ కావేషాలే కాదు. మౌఢ్యాలూ ఎక్కువే. ఆచారాలూ కట్టుబాట్లే కాదు... నగుబాట్లు కూడా ఎక్కువే!

మనిషిని మనిషి అర్థం చేసుకోవటంలో కన్నా చంపుకు తినటంలో లభించే ఆనందం ఎక్కువ ఇక్కడి మనిషికి.

అందుకే మనది భారత దేశం!!

* * *

ఆ రోజు రామతీర్థం ఇంటి ముందు జనం తీర్థ ప్రజలా గుమి గూడారు.

అంత మంది ఒక వ్యక్తి కోసం ఇంటి ముందు గుమి గూడారంటే అతడు రాజకీయ నాయకుడైనా అయ్యుండాలి, లేదా ఏ పెద కాపో అయ్యుండాలి.

రామతీర్థం మామూలు మనిషి. మరీ చెప్పాలంటే అతి సామాన్యుడు.

రామతీర్థం పదేళ్ళ క్రితం పొట్టచేత బట్టుకొని ఆ వూరొచ్చాడు. అప్పుడింత జనాభా లేదు. మూఢ నమ్మకాలూ గట్రా యిప్పటి కంటే కాస్త అధికంగానే వున్నా మిగతా విషయాల్లో కాస్తో కూస్తో బ్రతకడానికవకాశా లుండేవి.

రామతీర్థం వచ్చిన కొత్తలో మొదట కూలి పని చేశాడు. కష్టపడి పొదుపు పాటిస్తూ సంవత్సరం కాలంలో మూడు వందలు ప్రోగు చెయ్యగలిగాడు. ఆ పైకంతో చిన్న బడ్డీ కొట్టు తెరిచి స్వతంత్ర జీవనం సాగించనారంభించాడు.

అతడెవరో తెలీదు. ఎక్కడి నుండి వచ్చాడో తెలీదు. నాలన్న వాళ్ళు అతని కున్నారో లేరో తెలీదు. స్నేహితులు, బంధువులు వున్నారో లేదో తెలీదు.

ఎవ్వరితో అనవసరంగా మాట్లాడే నాడు కాదు. ఒకరి జోలికి పోయే వాడు కాదు. జరిగినంత వరకూ వ్యాపారం చూసుకునేవాడు. రాత్రి సరిగ్గా తొమ్మిది గంటలకి కొట్టుమూసేవాడు. కాకా హోటలుకి వెళ్ళి భోజనం చేసేవాడు. మర్రోజు ఉదయం కోసం హోటలు వాళ్ళకి ఉల్లిపాయలు, కూరగాయలు తరిగి యిచ్చేవాడు. ఉదయాన్నే కాలకృత్యాలు ముగించుకొని ఏడు కల్లా కొట్టు తెరిచేవాడు.

అతడి మాతృభాష ఏదో ఎవ్వరికీ తెలీదు. తెలుగు, కన్నడం, తమిళం, హిందీ భాషలు చక్కగా యాస లేకుండా మాట్లాడగలుగుతూండటంతో ఫలానా ప్రాంతం వాడు అని ఎవ్వరూ కనిపెట్టలేక పోయారు.

హైదరాబాదు గాలి సోకటంతో ఆ వూళ్ళో పాన్ బీడీలకి గిరాకీ హెచ్చింది. రామతీర్థం - పాన్ బీడీలు చక్కగా కట్టేవాడు. కష్టమర్ల అభిమానాన్ని, అభినందనల్ని అందుకొని వాళ్ళ సలహా మేరకు తన కొట్టుకి 'రామతీర్థం పాన్ బీడీ సెంటర్' అని నామకరణం కూడా చేశాడు.


జనాభా పెరుగుతోంది. సమాజంపై సాహితీ రంగం ప్రభావం బాగా చూపసాగింది. రచయితలూ, రచయిత్రులూ పెరిగారు. పత్రికలు పెరిగాయి. నిత్యావసర వస్తువుల్తో సహా అన్నిటికీ ధరలు పెరిగాయి.

పత్రిక కొని చదవటం కంటే ఆ పైకంతో నాలుగు పత్రికలు అద్దెకి తీసుకొని చదవటం మేలన్న నిర్ణయానికి రాసాగారు పాఠకులు. అది గ్రహించిన రామతీర్థం వెంటనే చొరవ చూపించాడు.

వార పత్రికలు, మాస పత్రికలే కాక ప్రముఖులు వ్రాసిన నవలలు కూడా రామతీర్థం కొట్టులో చోటు చేసుకున్నాయి. అతని పాన్ సెంటర్ ఎప్పుడూ జనంతో కిటకటలాడి పోయేది.

అయితే అలా కొంత కాలం మాత్రమే!!

మనది గొర్రెదాటు స్వభావం. ఎప్పుడూ ఎదటి




వాళ్లే పడగొట్టి మేడలు కడదామనే బుద్ధి తప్ప ఎదటి మనిషి చర్యని ఆదర్శంగా తీసుకొని మరో మంచి పని చేద్దామనే తెలివి తేటల్లేవు.

ఫలితంగా రామ రామ రామతీర్థం కొట్టుకి కుడి వైపున ఒకటి, ఎడమ వైపున ఒకటి, ఎదురుగా ఒకటి, వెనుక వైపున ఒకటి, అలాంటివే బంకులు వెలిశాయి. వాటిని చూసి మరెన్నో వెలిశాయి.

అందరూ అందలాలెక్కితే మోసే వాడెవడన్నట్టు ఇంత మంది బంకులు తెరిచేసరికి రామతీర్థం బెంబేలు పడిపోయాడు. అందులోనూ అతడు ఇటీవల వివాహం చేసుకొని వున్నాడు. ఇంటి అద్దె-కొట్టు అద్దె, కరెంటు ఛార్జీలు - రామతీర్థం తల తిరిగి పోయింది. ఇక బ్రతకటం కష్టమనిపించింది. అతడు కొట్టు మూసేసి ఓ కిరాణం కొట్టులో వెలకి నాలుగు వందల జీతం మీద గుమస్తాగా కుదిరి పోయాడు.

మరలాంటి రామతీర్థం ఇంటి ముందు అంత మంది జనం చేరటానిక్కారణం తెల్సుకోవాలని వుంది కదూ! మరి వెడదామా ఆ సన్నివేశంలోకి??

* * *

"నువ్వు మంచివాడివనీ, మర్యాదస్థుడివనీ అనుకున్నాం. ఇంత నీచప్పని చేస్తావనుకోలేదు" ఆగ్రహంగా అన్నాడు ఓ అల్లాటప్పయ్య.

"రేయ్-బైటకి రారా! నిన్ను చీల్చి చెండాడుతాం" అంత కంటే కోపంగా అన్నాడు మరో బాలకోటయ్య.

"వీడు సర్క్యులేటింగ్ లైబ్రరీ పెట్టినప్పుడే అనుకున్నాను. గురువా ఎవడి కొంపో ముంచుతాడని" మరో సీతారాముడు ఆవేదన వ్యక్తం చేశాడు.


"మరి అప్పుడే చెప్పరాదూ! వీణ్ని వీడి కొట్టుసీ తగల బెట్టి వుండే వాళ్ళం కదా!" నొచ్చుకున్నాడు ఇంకో రామచంద్రుడు.

ఇంకా ఇలా మరెందరో...

లోపల కూచుని రామతీర్థం అన్నీ వింటున్నాడు. అతని వదనం జేగురు రంగుకి తిరిగి వుంది. కారణం అతడు ఊహించనిదేం కాదు. అతడి హృదయంలో సముద్రుడు ఘోషిస్తున్నాడు. అగ్ని పర్వతం రగులుతోంది. ఒదురంతా స్వేదం అలముకుంటోంది. చేతులు కట్టుకొని నులక మంచం మీద కూర్చుని వున్నాడతడు.

బైట గోల అధికమైంది.

నెమ్మదిగా లేచాడు రామతీర్థం. ప్రళయ కాలరుద్రుడిలా వున్నాడతడు. మన్మథుని భస్మం చెయ్యటం కోసం మూడో నేత్రం తెరవబోతున్న ఫాలాక్షుడిలా వున్నాడతడు.



అతని అడుగులు తల వాకిలి గుమ్మం కేసి పడు తున్నాయి. ఒక ధైర్యం - ఒక స్థైర్యం - ఒక ఆత్మ విశ్వాసం - ఒక దృఢ నిశ్చయం తాండ విస్తోందా అడుగుల్లో.

మెల్లిగా తలుపులు తెరిచాడు రామతీర్థం. తుపాను ముందరి ప్రశాంత వాతావరణంలా వుంది అతని వదనం.

"ఏమిట్రా నువ్వు చేసిన పని?" అంగీ పట్టుకో బోయాడు అల్లాటప్పయ్య.

"పొట్టచేత బట్టుకొని వచ్చావని, చేయూత నిస్తే - బ్రతకడానికి సాయం చేస్తే ఎవడి కొంపో అంటించి పరి కాకుంటావ్రా!?" గుడ్లెర్రజేశాడు బాలకోటయ్య.

"వాడితో మాట లేంటయ్యా!" లాగండి బైటికి..." అర్చాడు సీతారాముడు.

గోల ఆపమన్నట్టు సైగ చేశాడు రామతీర్థం.

"ఏం చేశాను...?" ప్రశ్నించాడు అందర్నీ కలియ జూస్తూ.

"మాశారా మాశారా? ఏం చేశామా అని ఎంత కూల్‌గా అడుగుతున్నాడో!!!" గుండెలు బాదుకున్నాడు రామచంద్రుడు.

"అవును. ఏం చేశాను?"

"ఏం చేశావా? మా శంకరశాస్త్రి భార్యని లేవు కొచ్చావు. ఏమీ ఎరగనట్టు సంసారం చేస్తున్నావు. పెళ్ళి చేసుకున్నట్టు అందర్నీ నమ్మించావు."

"అమ్మో అమ్మో! లేపుకు రావటమే?! ఎంత సాహసం?"

"సాహసమా!? 'దుస్సాహసం' అను!"

"వీడికి లేకపోతే పోయింది, దానికైనా సిగ్గుండ క్కర్లా!? ఎవడితో బడితే వాడితో లేచిపోవడమే!?"

"ఏమిటయ్యా నువ్వు మాట్లాడేది? అంటే తగిన వాడు దొరికితే లేచిపోవచ్చా?...పాపం! శంకరశాస్త్రి ఎంతో అమాయకుడు. ఏమైపోయాడో ఏమిటో!"

"ఇది చేసిన నిర్వాకానికి పిచ్చి పట్టి, దేశాలు పట్టుకు పోయుంటాడు!"

"...ఆపండి..." గట్టిగా అర్చాడు రామతీర్థం. అతని ముక్కు పుటాలు అదురుతున్నాయి. ఆవేశం వల్ల శరీరం కంపిస్తోంది.

"మీరు మనుషులా, రాక్షసులా!"

"మనుషులం కాబట్టే..."

"కాదు. మీరు రాక్షసులు, రాబందులు! జరిగిం దేమిటో తెల్సుకోకుండా. అసలు నా భార్యని ఎవరు మాశారు?"

"నేను!" అల్లాటప్పయ్య అన్నాడు.

"శంకరశాస్త్రి నీకు బాగా తెల్సా?"

"ఆ...!"

"ఎలా తెల్సు?"

"వాళ్ళ నాన్న, మా నాన్న మంచి స్నేహితులు."

"మీదీ విమలాపురమేనా?"

"అవును."

"ఆమెని శంకరశాస్త్రి భార్యగా ఎప్పుడు గుర్తిం చావు?"



"నేనిటీవలే ఈ వీథిలోకి మారాను. నిన్న నేను, నా భార్య సినిమాకు వెడుతుండగా నువ్వూ ఆవిడా బజార్లో కన్పించారు. ఆమెని చూడగానే మొదట ఎక్కడో మాసినట్టనిపించి తర్వాత వెంటనే గుర్తొచ్చింది. ఇరుగు పొరుగుల్ని వాకబు చేశాను. నీ వివరాలు చెప్పారు. శంకరశాస్త్రి భార్యని నువ్వు చేసుకోవడమేమిటి? ఈ విషయం అందరితోనూ చెప్పాను. అందరం ఇలా బైలుదేరాం..."

"శంకరశాస్త్రిని మవ్వెన్నాళ్ళైంది మాసి?"

"ఆర్నెల్లయింది."

"యిప్పుడతనెక్కడున్నాడో తెల్సా?"

"ఊరొదిలి పోయుంటాడు."

"కాదు. లోకమే వదలి పోయాడు."

"ఆ...! అయితే...అయితే...చంపి మరీ ఎత్తు కొచ్చావన్నమాట!"

"మనిషిని మాటల్తో చంపే సంస్కారం మీకుం దేమోగాని నాకు లేదు. కామెర్ల రోగికి అంతా పచ్చగానే కన్పించినట్టు ఒకే దృక్పథంతో ఆలోచిస్తున్న మీకు అలాగే కన్పిస్తుంది. అసలు జరిగిన విషయం తెల్సా మీకు? నేను చెబుతాను వినండి..."

** ** **

అనగనగా ఒక సుమ. శుద్ధమైన బ్రాహ్మణ కుటుం బంలో పుట్టి ఛాందస సంప్రదాయాల మధ్య కూపస్థ మండూకంలా పెరిగింది. చదువు చెప్పిస్తే బైటికి పంపాల్సి వస్తుందని నాలుగ్గోడల మధ్య పెంచాడు వాళ్ళ నాన్న. వయసు పెరిగింది కాని వ్యక్తిత్వం పెరగలేదు. లోకజ్ఞానం పెరగలేదు.

పెళ్ళి సంబంధాలు చూడటం ప్రారంభించాడు వాళ్ళ నాన్న గౌరీశాస్త్రి. చెప్పులరిగాయికాని సంబంధం కుదరలేదు. ఇరుగు పొరుగుల సూటిపోటి మాటల వల్ల గుండెలమీది కుంపటి మరింత భారంగా అగుపించసా గింది.

శంకరశాస్త్రి కన్పించాడాయనకి. వివరాలు కనుక్కు న్నాడు. అటువేపు శంకరశాస్త్రి తండ్రి కూడ. తన కొడుక్కి వివాహమైతే చాలన్న ధోరణిలో వుండటంతో గౌరీశాస్త్రి అడగ్గానే ఎగిరి గంతేసి మరీ ఒప్పుకున్నాడు.

వెయ్యి రూపాయిల కట్నం, అయిదు వందలు పెళ్ళి ఖర్చుతో సుమ వివాహం ముగించి తృప్తిగా నిట్టూర్చాడు గౌరీశాస్త్రి.

తొలి రాత్రి సుమ శోభనపు గదిలో అడుగు పెట్టే సరికి మల్లెలు పరచిన మంచంపై శంకరశాస్త్రి నోట్లో వేలేసుకొని గాఢంగా నిద్రపోతున్నాడు. అంతే కాలోను కుని సుమ కూడ నిద్ర పోయింది.

మర్రోజు అమ్మలక్కల పరాచికాల మధ్య సుమకి ఒక్కో విషయమే తెలియసాగింది. క్రమంగా జ్ఞానో దయమైంది. తన భర్త కేవలం తిండికి, నిద్రకి తప్ప కనీసం భార్యని ప్రేమగా అక్కున చేర్చుకోవాలని, నాలుగు చల్లని మాటలు మాట్లాడాలని కూడ తెలీని అమాయకుడని చిన్నతనంలో మెదడుకి సంబంధించిన జబ్బేదో వచ్చి సరైన వైద్యం జరక్క అలా అయిపోయా డని తెల్సుకుని నిలువునా కూలిపోయింది.

ఇలా సంవత్సరం గడిచింది.

ఓ రోజు కల్లంలో పోసిన వేరుశనగ కాయలకి కాపలాకి వెళ్ళిన శంకరశాస్త్రి పాము కాటుకి గురై మర్రోజుకి శవమయ్యాడు.

బావురు మంది సుమ.

జరగాల్సిన వన్నీ జరిగాక సంప్రదాయం ప్రకారం సుమకి శిరోముండనం చేయించి ఎర్ర చీర చుట్ట బెట్టారు పెద్దలు.

అసలు కలలే రాక, కలలు వచ్చే తరుణంలో జీవితం కాలిపోయి భవిష్యత్తు బూడిదై వలపుల బోడిగా బ్రత కాల్సిన సుమ-బోడి ముండై పుట్టింట్లో చేరింది.

ఎవరు చూసినా చిరుక్కునే వాళ్ళు. ఎదురైతే తిట్ల పోసేవాళ్ళు. బండచాకిరీ చేయిస్తూ సూటిపోటి మాట లతో హింసించే వాళ్ళు.

కన్నతండ్రి సైతం శత్రువుగా మారితే ఏ కూతురు మాత్రం ఏం చేస్తుంది? రెండవ పూట ఆహారంగా ఆవేదనని తింటూ కన్నీళ్ళు తాగుతూ బ్రతుకీడ్వ సాగింది సుమ.

రానురాను ఆమెని బైటికి పంపించటం ప్రారంభిం చారు. కూరగాయలు తేవాలి. వాళ్ళ నాన్నకి బీడీలు తీసుకు రావాలి. పిండి మరకి వెళ్ళాలి. ఇలా ఎన్నో...

బీడీలు కొనటానికి రామతీర్థం కొట్టుకి వచ్చేది సుమ. రామతీర్థం ఆమెని గమనించేవాడు. అతడి గుండె తరుక్కుపోయింది. అతడు తల్లి ప్రేమకి నోచుకోని అభాగ్యుడు. సవతి తల్లి ఆరడి భరించలేక పారిపోయి వచ్చిన వాడు. సుమలోని అంతర్మధనాన్ని గుర్తించాడు. నెమ్మదిగా పరిచయం పెంచుకున్నాడు. వివరాలు తెలుసుకున్నాడు. జీవితంపై ఆశలు పెంచాడు.

ఒక రోజున విద్యుత్తు ప్రసరిస్తోన్న ఆ ఇనుప పంజరంలోంచి బైటికి వచ్చింది సుమ. తిరుపతి వెళ్ళారు. పవిత్రమైన మాంగల్యంతో ఆమెని తన స్వంతం చేసుకున్నాడు. అనుమానం రాకూడదని ఇద్దరూ గుళ్ళు చేయించుకున్నారు. నుదుటి కుంకుమతో ఆకు పచ్చని చీరతో ఎర్రని గాజులతో పసుపు పాదాలతో వచ్చింది సుమ.

ఊరికి దూరంగా ఇల్లు తీసుకుని అందులో సుమతో కాపురం పెట్టాడు రామతీర్థం.

** ** **

"...ఇప్పుడు చెప్పండి...నిజమే. నేనామెని లేపుకొచ్చాను. ఇది తప్పే అయితే శిక్ష అనుభవిస్తాను. ఆమె పట్ల తప్పుచేసిన వాళ్ళు ఇంకా వున్నారు. సంప్రదాయం పేరిట ఆమెని నిర్బంధంలో పెంచి తప్పు చేశాడు వాళ్ళ నాన్న. బాధ్యత వదిలిందే చాలని పనికి మాలిన వాడికిచ్చి పెళ్ళి చేశాడు.

బాధ్యత! అతనికి బాధ్యత తెలుసా?!

కప్పగంతుల
మల్లికార్జునరావు
సంచలనాత్మక సీరియల్
ది నీడిల్
త్వరలో ప్రారంభం

తనకొడుకు పనికి మాలిన వాడని తెలిసి కూడ స్వార్థంతో తన కోడలుగా చేసుకున్నాడు సుమని, శంకరశాస్త్రి తండ్రి.

వాడికి పెళ్ళయితే ఆ పిల్లకి శూన్యం తప్ప మరేమీ మిగలదని తెలీని అమాయకుడా అతడు?

విధి వక్రమాపు చూపి భర్తని కాటు వేస్తే సౌభాగ్యం ప్రకటించి ఆమె జీవితాన్ని తిరిగి వెలిగించే ప్రయత్నం చెయ్యకుండా బోడిముండని చేసి మూల కూచోబెట్టారు ఈ పెద్దలు. వెట్టి చాకిరీ చేయించుకోవడమే కాకుండా ఎదురొస్తే అపశకునమని ఈసడించుకున్నారు ఈ పెద్దలు.

వెళ్ళండి. వాళ్ళ వద్దకి వెళ్ళండి. అడగాల్సినవేవో వాళ్ళని అడగండి...ఇక్కడేదైనా రభస జరిగిందో పోలీస్ కంప్లయింట్ యివ్వాల్సొస్తుంది..." ధడాలున తలుపులు వేశాడు రామతీర్థం.

** * **

జాతకంలో దోషం వుందని ముందుగా మేకపోతుతో వివాహం జరిపించి ఆనక దాన్ని వధించి ధృతరాష్ట్రునికిచ్చి చేస్తే గాంధారిని 'ముండ' అంది మన దేశం.

చచ్చిన మొగుడితో బాటు చితిలో దూకుతానంటే ఎగిరి గంతేసి రూప్ కన్వార్‌ని చావనివ్వటమే కాకుండా స్మృతి చిహ్నంగా మందిరం కట్టించింది మన సమాజం.

భర్త పోయినంత మాత్రాన ఆడది మోడు కావాల్సిన పన్లేదని, అవకాశం వస్తే ఆ జీవితాన్ని వెలిగించవచ్చని, వెలిగించటానికి ప్రయత్నించాలని, తెలీని అజ్ఞానంలో కొట్టుకు పోతోంది మన వాతావరణం.

ఏ దేశ మేగినా-
ఎందు కాలిడినా-
మనుషులంతా ఒక్కటే...!
అనురాగం ఒక్కటే...!
ఆవేదన ఒక్కటే...!
సమాజమంటే-దేశమంటే-మనమే!

అందుకే మనమందరం కల్సి ఆమెని మన స్ఫూర్తిగా 'దీర్ఘసుమంగళీభవ' అని ఆశీర్వదించుదాం...


గమనిక

విహార యాత్రికులు / ప్రయాణీకులు

న్యూఢిల్లీకు విచ్చేసినపుడు

హోటల్ సదరన్‌లో బసచేయండి.

సింగిల్ రూం—రూ.90/- డబుల్ రూం—రూ.120/-
డార్మిటరీ వసతి కూడా లభిస్తుంది.
ఉత్తమమైన దక్షిణ భారత శాఖాహార రెస్టారెంటు కలదు.
రైల్వేస్టేషన్ మరియు విమానాశ్రయము నుండి హోటల్‌కు ఉచిత రవాణా సౌకర్యం.

సదరన్ ట్రావెల్స్, న్యూఢిల్లీ నుండి ప్రత్యేక విహార యాత్రలను ఆగ్రా, మధుర, హరిద్వార్, రిషీకేష్, జైపూర్, శ్రీనగర్, వారణాసి మరియు పెక్కు స్థలములకు సూపర్ డీలక్స్ వీడియో కోచ్‌ల ద్వారా ఏర్పాటు చేస్తుంది.

రిజర్వేషన్లకై సంప్రదించండి:
హైద్రాబాదు: ఫోన్: 36971, 227233
మద్రాస్: ఫోన్: 31553.

హోటల్ సదరన్
18/2 ఆర్య సమాజ రోడ్, కరోల్ బాగ్,
న్యూఢిల్లీ—110 005. ఫోన్: 5722210





Mfrs:
ASOKA APPALAM
COMPANY
MADURAI - 625 020